ఏపీలో పెరిగిన ఉష్ణోగ్రతలు

మార్చి15 వతేదీ నుండి ఒంటి పూట బడులు ?

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: ఏపీలో రోజురోజుకు ఉష్ణోగ్రతలుపెరుగుతున్నాయి. ఎండలు అధికం కాగా సామాన్య ప్రజానీకం పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఎండల ధాటికి రోజు వారీ కూలి పనులకు వెళ్లే కూలీలు, తోపుడుబండ్ల వ్యాపారులు పడుతున్న అవస్థలు ఎక్కువే. అలాగే ఉపాధి హామీ కూలీలు సైతం ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారు. కూలీలకు సమ్మర్ సీజన్ పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. త్వరలోనే ఉపాధి కూలీలు పని చేసే ప్రాంతాలలో టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తదితర సామాగ్రితో పాటు మజ్జిగను సైతం అందిస్తారని తెలుస్తోంది. అయితే పెరుగుతున్న ఎండల ధాటికి విద్యార్థులు గత కొద్దిరోజులుగా ఒంటి పూట బడులపై ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారు. అందుకే మొత్తం మీద ప్రభుత్వం మార్చి నెల 15వ తేదీ నుండి ఒంటి పూట బడులను నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైందని సమాచారం. మార్చి 17 నుండి పదవ తరగతి పరీక్షలు ఏపీలో ప్రారంభం కానున్నాయి.

విశాలాంధ్ర



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు జిల్లా

ఆదివారం 02 మార్చి, 2025 4 పేజీలు

రాష్ట్ర బడ్జెట్లో చేనేతకు అన్యాయం

పముజుల హరి

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: రాష్ట్ర బడ్జెట్లో చేనేతకు తీవ్రమైన అన్యాయం జరిగింది.. చేనేత పరిశ్రమపై లక్షలాదిమంది ఆధారపడి జీవిస్తున్నారు.. దాదాపుగా లక్ష మగ్గాలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నవి చేనేతపై ఐదు లక్షల మంది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. ఎక్కువమందికి ఉపాధి చూపించే పరిశ్రమగా చేనేత ఒకటి బడా పరిశ్రమ దారులకు పరిశ్రమలు పెట్టుకునేందుకు 1000 కోట్ల నుండి పదివేల కోట్లు వరకు ఉపాధి కల్పిస్తారని పేరుతో వారికి వేల ఎకరాలు నీటి సౌకర్యం కల్పించి వేలకోట్ల రూపాయలు రాయితీలు కల్పిస్తారు లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న చేనేత పరిశ్రమకు 138 ఒట్ల రూపాయలు బడ్జెట్లో కేటాయించడం దారుణమైన పరిస్థితి నెలకొంది. ఇందులో త్రిఫ్ట్ పండు కింద 5 కోట్ల రూపాయలు మాత్రమే చేనేత సహకార సంఘాల సభ్యులకు మాత్రమే ఉపయోగపడుతుంది ఎన్‌సిడిసికి ఐదు కోట్లు, యూనిట్ మాలికి 66 కోట్లు కేటాయించడం వలన చేనేత కార్మి కుల దగ్గరకు వెళ్లదు. మిగిలిన 110 కోట్లు అలంకార ప్రాయంగా ఉన్నదిగత ఎనిమిది సంవత్సరాలుగా సహకార సంఘాలకు ప్రభుత్వం నుండి రావలసిన బకాయిలు యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ, రిబేటు, త్రిఫ్ట్ ఫండ్, మరియు మార్కెట్ ఇన్వెస్ట్ బకాయిలు చెల్లించే ఊసే బడ్జెట్లో కనపడటం లేదు. ఇప్పుడైనా ప్రభుత్వం మేలుకొని చేనేత కార్మికుల పట్ల బడ్జెట్లో పెట్టవలసిన అమౌంట్‌ని పునరాలోచించి పెట్టవలసిందిగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షులు పముజుల హరివిజ్ఞప్తి చేస్తున్నారు. చేనేత కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాటాలు జరుగుతూనే ఉంటాయన్నారు.

ఎన్నికల హామీలను ఒక్కొకటిగా అమలు చేస్తున్నాం

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో మంత్రి నారాయణ

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: నగరంలోని 54వ డివిజన్ భగత్ సింగ్ కాలనీలో శనివారం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెల ఒకటో తారీఖున ఉదయం ఆరు గంటల నుండి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెల ఒకటో తారీకు 68 లక్షలు మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నామన్నారు. సీఎం ఆదేశాల మేరకు 99 శాతం పింఛన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం పింఛన్ల కోసం వృద్ధులను మహిళలను వికలాంగులను సచివాలయాలు చుట్టూ తిప్పుకునేదని, ఆ క్రమంలో కొందరు మరణించడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు అదే పింఛన్ల కార్యక్రమాన్ని తమ ప్రభుత్వం ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీని విజయవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. చంద్రబాబు లాంటి అపార అనుభవం ఉన్న నాయకునికి జగన్ వంటి అనుభవం లేని నాయకులకి చాలా తేడా ఉందన్నారు. నిన్నటి బడ్జెట్లో ఎస్సీ ఎస్టీ బీసీలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని చెప్పుకొచ్చారు. ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు ఒక్కొక్కటి పూర్తి చేస్తున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్ల పంపిణీ విషయంలో ఎన్నికల ముందు చెప్పిన విధంగా అరియర్స్‌తో సహా మొదటి నెలలోనే పింఛన్లను అందించామన్నారు. అన్న క్యాంటీన్ల విషయంలో జగన్మోహన్ రెడ్డి నిరుపేదల కడుపు కొట్టారన్నారు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు ఉదయాన్నే కూలి పనులు వారికోసం 204 అన్న క్యాంటీన్లనుఏర్పాటు చేసి 2,25,000 మందికి కేవలం 5రూ కే కడుపునిండా భోజనం అందిస్తున్నామన్నారు. వాటిని జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ఎన్డీఏ ప్రభుత్వం రాగానే తిరిగి అన్న క్యాంటీన్లను రాష్ట్రవ్యాప్తంగా పునరుద్ధరించామని చెప్పారు.అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు మహిళలకు సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ లు, రైతు భరోసా కింద రైతులకు 20 వేలు అందించడం జరిగిందన్నారు. త్వరలో తల్లికి వందనంతో ప్రతి విద్యార్థికి 15 వేలు అందించనున్నామన్నారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు వాటన్నిటిని అధిగమించి ఒక్కొక్కటిగా హామీలన్నీ నెరవేరుస్తున్నారని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో మున్సిపాలిటీల కు ప్రజలు కట్టే పనులను ఇకపై ఆయా మున్సిపాలిటీలకే ఖర్చు చేసే విధంగా ముఖ్యమంత్రి ఆదేశించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం మున్సిపాలిటీకి ప్రజలు చెల్లించే ఇంటి పన్నులు కొళాయి పనులు ఇతర పనులను సిఎఫ్ఎంఎస్ లోకి తీసుకువెళ్లి దారి మళ్లించి ఇష్టారాజ్యంగా వ్యవహరించిందన్నారు. రానున్న మూడు సంవత్సరాల్లో ప్రతి ఇంటికి తాగునీటి కొళాయి అందించాలని సంకల్పించడం జరిగిందన్నారు. తమది ప్రజా ప్రభుత్వమని, ప్రజల అవసరాలను గుర్తించి వారి బాగోగులు చూస్తున్నామని మంత్రి నారాయణ వివరించారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, మున్సిపల్ కమిషనర్ సూర్య తేజ, డిప్యూటీ మేయర్లు రూప్ కుమార్ యాదవ్, తహసీన్, కార్పొరేటర్లు, ఇతర అధికారులతో కలిసి లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ పింఛన్ నగదును అందజేశారు. మంత్రిస్థానిక ప్రజలతో మమేకమవుతూ, వారు తెలిపిన సమస్యలకు అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కారం చూపారు.

పేదల జీవితాల్లో సంతోషం నింపే బడ్జెట్

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తుందన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణి చేసేందుకు విచ్చేసిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి కొడవలూరు మండలం రెడ్డిపాళెం గ్రామంలో ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. సచివాలయ సిబ్బంది, ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో కలిసి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఇంటింటికెళ్లి పెన్షన్లు అందచేశారు. ప్రజల యోగ క్షేమాలను విచారిస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం విస్మరించిన గ్రామాభివృద్ధి టిడిపి అధికారంలోనికి వచ్చాక గాడిలో పడిందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నిక అయ్యాక రెడ్డిపాళెం గ్రామంలో ఎన్నికల సందర్భంగా యిచ్చిన హామీ తాలూకు తాగునీటి సమస్యను పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. రెడ్డిపాళెం నుంచి అటు చెర్లోపాళెం, వేగూరు, మోడేగుంట, ముదివర్తి గ్రామాలకు వెళ్ళే మార్గ మధ్యలో తెగిపోయి వున్న బ్రిడ్జ్‌ను సాధ్యమైనంత త్వరలో పునరుద్ధరిస్తామన్నారు. ఆధార్ కార్డులు లేని కారణంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకోలేక పోతున్న గిరిజనుల కోసం స్పెషల్ ఆధార్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఎస్టీలకు నివాస స్థలాలతో పాటు పక్కా ఇళ్ళు నిర్మించి ఇచ్చేందుకు కృషి చేస్తానన్నారు. 35 రూపాయలతో ప్రారంభమైన పెన్షన్ల పథకాన్ని ఏకంగా 4 వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదేనన్నారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో వున్నా సంక్షేమ పథకాల అమలులో ఎటువంటి ఆటంకం జరగలేదన్నారు. రానున్న మే నెలలో తల్లికి వందనం పథకంలో భాగంగా చదువుకుంటున్న ప్రతి బిడ్డకు సంబంధించి తల్లుల ఖాతాలో 15 వేలు జమ అవుతాయన్నారు. ఐదేళ్లకు సరిపడా సంక్షేమం మరియు అభివృద్ధికి పునాదులు వేసుకుంటూ ఎన్నికల సందర్భంగా చేసిన ప్రతి హామీ అమలు చేసే దిశగా కృషి చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కొనియాడారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సుబ్బారావు, టిడిపి నాయకులు వెంకట రమణారెడ్డి, బెజవాడ వంశీకృష్ణా రెడ్డి, వినీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ డొల్ల.. రైతులు గుల్ల.. : మాజీ మంత్రి కాకాణి

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులు కాడి వదిలేసే పరిస్థితి వస్తుందని, చంద్రబాబు విజన్‌కి తగ్గట్టు వ్యవసాయం దండగ అనే రీతిలో ఈ బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని వైయస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆక్షేపించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తన పదవిని కాపాడుకోవడానికి లోకేష్‌ను పొగిడే స్థాయికి దిగజారిపోయారని ఆయన విమర్శించారు. అన్నదాత సుఖీభవకు కేటాయింపులు చూస్తే లబ్ధిదారులను తగ్గించే కుట్ర కనిపిస్తోందని చెప్పారు. పంటలకు మద్దతు ధరలేక ఒక రైతులు అల్లాడిపోతున్నా వారి గురించి పట్టించుకోకుండా ధరల స్థిరీకరణ నిధికి కేవలం రూ.300 కోట్లు కేటాయించారని దుయ్యబట్టారు. చంద్రబాబు చెప్పే మాటలకు బడ్జెట్ కేటాయింపులకు ఏమాత్రం పొంతన లేకుండా ఉంది. బడ్జెట్‌లో ఎక్కడా ప్రజల ఆశలు నెరవేరుతాయనే నమ్మకం కనిపించడం లేదు. గతం మోసం, వర్తమానం మోసం, భవిష్యత్తు నాలుగేళ్లు కూడా మోసమే అన్నట్లుగా ఈ బడ్జెట్ ఉంది. ఇందులో రైతులు, యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు అనే తేడా లేకుండా అన్ని వర్గాల నమ్మకాన్ని వమ్ము చేశారు. మొక్కుబడి కేటాయింపులతో సరిపుచ్చి, ఏ పథకాన్ని ఎంతమందికిఅమలు చేయబోతున్నామనే స్పష్టత ఇవ్వలేదు. విత్తనం నుంచి అమ్మకం వరకు గత వైయస్సార్‌సీపీ పాలనలో రైతులకు అండగా నిలబడితే నేడు కూటమి పాలనలో రైతులకు కష్టాలు తప్పడం లేదు. రాష్ట్రంలో వ్యవసాయ రంగంపై ఆధారపడి 62 శాతం మంది బతుకుతున్నాచంద్రబాబు వచ్చాడు, వ్యవసాయాన్ని మళ్లీ దండగ చేస్తున్నాడనే నానుడిని నిజం చేసేలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి. అన్నదాత సుఖీభవ కేటాయింపులు చూస్తే ఎంతమంది రైతులను మోసం చేయడానికి సిద్ధంగా ఉన్నాడో అర్థమవుతుంది. పీఎం కిసాన్ సాయంతో కలిపి రైతు భరోసా అమలు చేస్తున్నారని వైయస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించిన చంద్రబాబు, తాము అధికారంలోకి వస్తే, కేంద్రం ఇచ్చేది కాకుండా రూ.20 వేల చొప్పున ఇస్తామని ప్రచారం చేశారు. కానీ, ఇప్పుడు కేంద్రం ఇచ్చే సాయాన్ని కలిపి అన్నదాత సుఖీభవలో రూ.20వేల చొప్పున ఇస్తామని ప్రకటించి, రైతులను మోసం చేస్తున్నారు. గత వైయస్సార్‌సీపీ పాలనలో పాడి రైతులకు మేలు చేసిన అమూల్ సంస్థ పేరే ఎత్తకపోవడం చూస్తుంటే హెరిటేజ్‌కి లబ్ధి చేకూర్చాలన్న లక్ష్యం స్పష్టంగా కనపడింది. బడ్జెట్ డొల్ల.. రైతులు గుల్ల అనేలా ఈ వ్యవసాయ బడ్జెట్ ఉంది. ప్రచారం మోత, పథకాలకు కోత, ప్రజలకు వాత, ఇది మన తలరాత అని బాధపడాల్సిన బడ్జెట్ ఇది. అందుకే ఈబడ్జెట్‌ను తమ పార్టీ వ్యతిరేకిస్తోందని కాకాణి గోవర్ధన్‌రెడ్డి వివరించారు.

మాదిగ అమరవీరులకు జోహార్లు

విశాలాంధ్ర-ముత్తుకూరు: మాదిగ రిజర్వేషన్ 30 ఏళ్ల పోరాటంలో అమరవీరులైన మాదిగలకు జోహార్లు అర్పిస్తున్నామని మాదిగ రిజర్వేషన్ పోరాట కమిటీ జిల్లా అధ్యక్షులు తెలిపారు. ఆగస్టు 1న సుప్రీంకోర్టు రిజర్వేషన్లు వర్గీకరణను చేస్తున్నట్టు ప్రకటించిన జరిగిందన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత సాంఘిక సామాజిక పోరాట నాయకులు మంద కృష్ణ మాదిగ అలుపెరగని పోరాటం 30 ఏళ్లకు చేరిన తర్వాతనే ఎస్సీ వర్గీకరణ జరిగిందన్నారు. పలుమార్లు వర్గీకరణ కోసం చేసిన పోరాటాల్లో కొందరు మాదిగ వీరులు అమరులైన విషయం తెలిసిందేనని మాదిగ రిజర్వేషన్ పోరాటం కమిటీ జిల్లా అధ్యక్షులు ఉదయ్ అన్నారు. అలాంటి వారి ఆశయ సాధన కోసం మనమంతా భవిష్యత్తులో మరింత కృషి చేయాల్సి ఉంటుందని పోరాటంలో వీరమరణం పొందిన మాదిగ సోదరులకు మార్చి ఒకటవ తేదీన దేశవ్యాప్తంగా జోహార్లు అర్పించే కార్యక్రమం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ కార్యదర్శి తాళ్లూరు శేషయ్య, జిల్లా నాయకులు పల్లాల కృష్ణయ్య, స్థానిక నాయకులు పల్లాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మొదలైన ఇంటర్ పరీక్షలు

విశాలాంధ్ర-మర్రిపాడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. శనివారం ప్రథమ సంవత్సరంకు సంబందించిన పబ్లిక్ పరీక్షలు జరుగగా, సోమవారం నుండి ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పరీక్షలు జరుగనున్నాయి. పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేసామని, మొదటిరోజు 248 విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 237 మంది హాజరయ్యారు. 11 మంది విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు ప్రిన్సిపల్ విజయలక్ష్మి తెలిపారు. పరీక్ష కేంద్రం లో పోలీస్ బందోబస్తు పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

చెత్త నుండి సంపద తయారీపై శిక్షణ

విశాలాంధ్ర-బిట్రగుంట: బోగోల గ్రామపంచాయతీ పరిధిలోని లోకల్ శిక్షణ కేంద్రం నందు శనివారం గృహాల నుండి తడిచెత్త, పొడిచెత్తను వేరు చేయుట నాడెప్ తొట్లలో వర్మికంపోస్ట్ తయారు చేయుట, పశుపక్షాదుల దహనవాటిక నిర్వహణతోపాటు, పచ్చదనం పరిశుభ్రతపై అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లకు జిల్లారిసోర్స్ పర్సన్ శ్రీనివాసులురెడ్డి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ షెడ్ల ద్వారా సంపద సృష్టించి గ్రామపంచాయతీల అభివృద్ధికి ఉపయోగించు కోవాలన్నారు. పై కార్యక్రమంలో బోగోలు మండల విస్తరణాధికారి షేక్ నయుం, పంచాయితీ కార్యదర్శి అబ్దుల్ జహీర్, వివిధ పంచాయతీల కార్యదర్శి గ్రీన్ అంబాసిడర్స్, గ్రీన్ గాడ్స్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి అక్షయకు మానవత సాయం

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: కందుకూరు అమల నాధుని వారి పాలెం ప్రాథమిక పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న చిన్నారి అక్షయకు ఎనిమిది నెలల కిందట తండ్రి కాలం చేసాడు. దివ్యాంగు రాలైన తల్లి ఆదిలక్ష్మి అనారోగ్యం కారణంగా పోషణ కు ఇబ్బంది పడుతున్న కారణంగా వారి దీన స్థితి తెలుసుకున్న కందుకూరు "మానవత" స్వచ్చంద సంస్థ అధ్యక్షుడు ఎల్ ఐ సి డెవలప్మెంట్ ఆఫీసర్ శశిధర్ రెడ్డి అయిదు వేల రూపాయలు ఆర్థిక సహాయం చేసారు. మానవత సంస్థ కందుకూరు శాఖ ప్రారంభం లోనే మానవత్వాన్ని నిరూపించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా మానవత అధ్యక్షులు సోమిశెట్టి శ్రీనివాసులు, కందుకూరు మానవత అధ్యక్ష కార్యదర్శులు శశిధర్ రెడ్డి, గౌస్, ఓలేటి కొండల రావు, గేరా జైపాల్, సింగరాయ కొండ అధ్యక్షులు నారాయణ, జిల్లా కార్యదర్శి రిటైర్డ్ ఎంఈఓ యలమందారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు పరిశుభ్రత రహదారులు నిర్మాణం లేకుండా ప్రజలు నివసించటం సాధ్యమా..?

మున్సిపల్ అధికారులను ప్రశ్నించిన సిపిఐ ప్రతినిధి బృందం

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: నివాసాల సమీపంలో పక్కన ఉన్న ఖాళీ స్థలాల పరిశుభ్రత లేకుండా, నివాసాల సమీపంలో రహదారి నిర్మాణాలు లేకుండా జీవనం నివసించటం సాధ్యమా? అని సిపిఐ ప్రతినిధి బృందం మున్సిపల్ అధికారులను ప్రశ్నించింది. శనివారం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పోకూరి మాల కొండయ్య, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి.సురేష్ బాబు ఆధ్వర్యంలో సిపిఐ ప్రతినిధి బృందం ఎస్కే హుస్సేన్, ద్రోణాదుల ఆదినారాయణ, బాల బ్రహ్మాచారి, ఉప్పుటూరి మాధవరావు, దుర్గాప్రసాద్, కోటేశ్వరరావు కోట రెడ్డి నగర్ ప్రాంతంలో పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాలకొండయ్య నివాసం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో చెత్తాచెదారంతో పాటు పిచ్చి పొదలు అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మాల కొండయ్య పలుమార్లు మున్సిపల్ అధికారులకు దృష్టికి తీసుకెళ్లిన ఈరోజుకి సమస్య పరిష్కారం కాలేదు. కోటారెడ్డి నగర్ ప్రాంతంలో మరో ప్రాంతంలో పై భాగాన రహదారి నిర్మించి, కిందికు రహదారి నిర్మాణం లేకపోవడంతో ఆ ప్రాంతంలో రహదారికి ఇరువైపులా ఉన్న ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సిపిఐ ప్రతినిధి బృందం ఆ ప్రాంతాన్ని పరిశీలించింది. ఈ సందర్భంగా మాల కొండయ్య, సురేష్ బాబులు మాట్లాడుతూ ఇప్పటికి పలుమార్లు మున్సిపల్ అధికారులకు ప్రజలు విన్నపాలు చేసిన సమస్యలు పరిష్కారం కాలేదని. ఈనెల మూడవ తేదీ సోమవారం అధికారం కలిసిన తదుపరి సమస్య పరిష్కారం కాకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ప్రజల కోసం ధర్నా కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

సామాజిక సేవలో రోటరీ క్లబ్ పాత్ర అభినందనీయం

విశాలాంధ్ర-గుడ్లూరు: అంతర్జాతీయ స్థాయిలో కూడా సామాజిక సేవలో రోటరీ క్లబ్ పాత్ర అభినందనీయం అని గుడ్లూరు మండల అభివృద్ధి అధికారి వై.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంఆర్సి భవనం పక్కన నాన్ భవిత స్కూల్ నందు రోటరీ క్లబ్ ఆఫ్ కావలి వారు నిర్వహించిన క్లాత్ కిట్స్, వాటర్ బాటిల్స్, నోట్ బుక్స్, క్రేయాన్స్, పెన్స్ మరియు స్లేట్స్ మొదలైన స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా విచ్చేసిన గుడ్లూరు మండల ఎంపీడీవో అక్కడ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలతో వారి అభ్యసన వివరాల గురించి ముచ్చటించారు. రోటరీక్లబ్ ఆఫ్ కావలి, ప్రెసిడెంట్ స్వర్ణలత మాట్లాడుతూ చక్కని అభ్యాసనతో తమకున్న వైకల్యాన్ని అధిగమించి మంచి ప్రగతిని సాధిస్తున్న చిన్నారులను అభినందిస్తూ ఆ దిశగా విద్యార్థులను అభివృద్ధి చేసి ప్రోత్సహిస్తున్న భవిత స్కూల్ టీచర్ శరత్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మరియు స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్ కే.రామ్మోహనరావు, స్థానిక గుడ్లూరు డాక్టరు మారుతీ రావు, శారద కుమార వర్మ సుధాకర్ ఉపాధ్యాయులు ఎం వి ఎస్ ఎస్ వి ప్రసాద్ యాసిన్ భాషా ఎమ్మార్సీ సిబ్బంది శివకుమార్ జీవిత మల్లికార్జున ఇంకా ఇతర రోటరీ సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో మహిళ దినోత్సవ వారోత్సవాలు

విశాలాంధ్ర-ముత్తుకూరు: ఈనెల 8వ తేదీన మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని మనల్ని ఐసిడిఎస్ ముత్తుకూరు, పెడతా పోలూరు, పంటపాలెం సెక్టార్లలో బేటి వచ్చావో బేటీ పడావో, కార్యక్రమం కింద ర్యాలీ నిర్వహించారు. ముత్తుకూరు పాత దళితవాడ అంగన్వాడి కేంద్రం జరిగిన కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ అమ్మమ్మ, పంటపాలెం సెక్టర్లో పరిధిలో జరిగిన కార్యక్రమంలో సూపర్వైజర్ సుబ్బమ్మ, పెడతా పోలూరు సెక్టర్ పరిధిలో జరిగిన కార్యక్రమంలో సూపర్వైజర్ మంజుల లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషోర్ బాలికలు, తల్లులు, గర్భవతులకు అవసరమైనటువంటి ఆహారపు అలవాట్లను, అలాగే ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముత్తుకూరు దళితవాడ అంగన్వాడి కార్యకర్త రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. అలాగే పంటపాలెం, తిడతాపోలూరు లలో జరిగిన కార్యక్రమంలో కూడా అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు.

అట్టహాసంగా ముగిసిన క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణంలోని బాలుర హైస్కూల్ మైదానంలో గత వారం నుండి జరుగుతున్న కేపిఎల్ సీజన్ 4 క్రికెట్ పోటీలు అట్టహాసంగా ముగిశాయి. స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఘనంగా ప్రారంభించిన ఈ పోటీలు పట్టణ ప్రజలను, క్రికెట్ అభిమానులను బాగా అలరించాయి. వివిధ జిల్లాల నుండి సెలెక్టెడ్‌గా 16 జట్లు పాల్గొనగా పలు జిల్లాల తోపాటు తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుండి క్రీడాకారులు ప్రత్యేకంగా వచ్చి ఈ టోర్నమెంట్‌లో ఆడటం విశేషం. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్లో ఒంగోలు ఏసీసీ జట్టు సింగరాయకొండ ఎస్సీసీ జట్టు తలపడగా ఒంగోలు జట్టు విజయం సాధించింది. చిరుపోటి వ్యత్యాసంతో సింగరాయకొండ జట్టు రన్నరప్ గా మిగిలింది. మొదటి బహుమతి లక్ష రూపాయలు, రెండవ బహుమతి యాభై వేలు రూపాయలు తోపాటు క్రికెట్ ట్రోఫీని ఇరు జట్లు అందుకున్నాయి. ఫైనల్ విజేతలకు అతిధులుగా విచ్చేసిన ప్రణవి వైద్యశాల డాక్టర్ నవీన్ కుమార్, ఉడ్ ల్యాండ్స్ హోటల్ కృష్ణ, సీనియర్ ప్లేయర్ కొంగల నాగరాజు కలిసి బహుమతులను అందజేశారు. దూరప్రాంతాల నుండి వచ్చి క్రికెట్ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులను సీనియర్ ప్లేయర్ కొంగల నాగరాజు అభినందించారు.

పిఎం జెజెబివై బీమా ద్వారా ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు మండలంలోని పెనుబర్తి గ్రామానికి చెందిన టి.సుకన్య క్యాన్సర్‌తో గత సంవత్సరం డిసెంబర్‌లో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు టి. పోల్ రెడ్డి ఎస్ఎస్ టి ఆర్గనైజేషన్ అనంత సాగరం అక్షరాస్య కేంద్రం వారి ద్వారా పిఎం జెజెబివై భీమా పథకం గురించి తెలుసుకొని వారి సహకారంతో రాపూరు కెనరా బ్యాంక్‌లో క్లెయిమ్ చెయ్యడం జరిగింది. భీమా సెక్షన్ కావడంతో బ్యాంక్ చెక్‌ను కెనరా బ్యాంకు మేనేజర్ షరీఫ్ చేతులమీదుగా కుటుంబ సభ్యులు టి.పోల్ రెడ్డికి అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో కెనరా బ్యాంక్ మేనేజర్ షరీఫ్, అసిస్టెంట్ మేనెజ్వెంచలయ్య, ఫీల్డ్ ఆఫీసర్ మస్తాన్, విఓఏ విజయమ్మ అనంతసాగరం సిఎఫ్ఐ కౌన్సెలర్లు ఎస్ కె.హబీబున్నీసా, ఏ.గిరిబాబు, షారుక్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులను సందర్శించిన ఏపీడీ

విశాలాంధ్ర-వలేటివారిపాలెం: మండలంలోని పోకూరు, నూక వరం, కొండసముద్రం గ్రామాల లో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను కందుకూరు ఏపీడీ బాబూరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కూలీలకు సరాసరి వేతనం 300రూపాయలు కూలి వచ్చేవిధంగా కొలతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ రైతులకు రైతు వారీ కుంటలు ప్రతి గ్రామంలో 25కు తగ్గకుండా పనులు చేపట్టాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఏలు అశోక్, నాగార్జున, ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్బానాయుడు తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు మార్చి 3 నుంచి గ్రాండ్ టెస్టులు

విశాలాంధ్ర-కొండాపురం: మార్చి 17 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 33,443 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు పొందేందుకు విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లడం హర్షనీయమని సీనియర్ గణిత ఉపాధ్యాయులు చల్లా చంద్రశేఖర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక, ప్రతిరోజు సాయంత్రం ఒక్కొక్క సబ్జెక్టులో పరీక్ష నిర్వహించడం, ఎస్సీఈఆర్టీ బ్లూ ప్రింట్ ప్రకారం ముఖ్యమైన ప్రశ్నలు మెటీరియల్ గా అందజేయడం, మాదిరి ప్రశ్న పత్రాలు ఇవ్వడం, సెలవు రోజుల్లోనూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం, పబ్లిక్ పరీక్షల్లో రెండు పరీక్షలకు మధ్యన కనీసం ఒకరోజు విరామం ఇవ్వడం, గతంలో లేని విధంగా గ్రాండ్ టెస్ట్ లు నిర్వహించడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం అన్నారు. గ్రాండ్ టెస్ట్ లు మార్చి 3 తెలుగు, 4న హిందీ, 5 న ఇంగ్లీష్, 7న గణితం,10న భౌతిక శాస్త్రం, 11న జీవశాస్త్రం, 13న సోషల్ పరీక్షలు నిర్వహించే విధంగా టైం టేబుల్ విడుదల చేశారు. ఈ పరీక్షలు విద్యార్థుల చదువుల మదింపుకు ఎంతో ఉపయోగకరం కానున్నాయి.

దోబీ ఘాట్‌కు భూమిని కేటాయించండి

విశాలాంధ్ర-జలదంకి: జలదంకి గ్రామంలో 70 కుటుంబాలకు పైగా నివసిస్తున్న రజకులకు అవసరమైన దోబీ ఘాట్ నిర్మాణానికి భూమిని కేటాయించాలని బిజెపి మండల అధ్యక్షుడు ముడి కిషోర్ రెడ్డి, బిజెపి యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్ రెడ్డి శనివారం తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లి తాసిల్దార్ ప్రమీలకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోబీ ఘాట్ లేక రజకులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, గతంలో స్పందన ద్వారా వినతి పత్రాలు సమర్పించినా ఫలితం లేదన్నారు. సానుకూలంగా స్పందించిన తాసిల్దార్ ప్రమీల దీని మీద పూర్తి వివరాలు తీసుకొని వారికి భూమిని కేటాయించేలా చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జలదంకి బిజెపి యువమోర్చా ప్రధాన కార్యదర్శి కామేపల్లి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

శెనగ పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయశాఖ అధికారులు

విశాలాంధ్ర-వలేటివారిపాలెం: వలేటివారిపాలెం మండలంలోని శాఖవరం గ్రామంలో మండల వ్యవసాయాధికారి ఎం.హేమంత్ భరత్ కుమార్ మరియు కందుకూరు వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు పి అనసూయ రైతులతో కలిసి శనగ పంట పొలాలను శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం శనగ పంట పూత మరియు కాయ దశలో ఉన్నది శనగలో మొదలు కుళ్ళు, వేరు కుళ్ళు తెలుగు ఉన్నదని, దీని నివారణకు తెగుళ్ళు సోకిన పొలాల్లో పంట మార్పిడి (జొన్న, సజ్జ, కొర్ర)చేసుకోవాలని తెలిపారు. ఉధృతి ఎక్కువ కాకుండా ఎకరాకు 200గ్రాములు కార్బన్ డైజిమ్ మరియు 600 గ్రాముల మాన్కోజెబ్ లేదా ట్రైకోడేర్మా విరిడీ 5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి అని సూచించారు. శాఖవరం గ్రామంలో శనగ పంటలో గ్యాప్ పొలంబడి నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ వారి సలహాలు సూచనలు తో పంటను సాగు చేస్తారని కోత అనంతరం రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా శనగ పంటను మార్కెట్ ధర కంటే 20 నుంచి 30 శాతం అధిక అధిక ధరతో కొనుగోలు చేస్తారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వం సహకారంతో ప్రతి రైతుకి ఒక ప్రత్యేక విశిష్ట సంఖ్య(యూనిక్ నెంబర్)ఇవ్వడం ద్వారా వ్యవసాయాన్ని సులభతరం చేసి పారదర్శకంగా సేవలను అందించడం కోసం చేయబడుతున్న బృహత్తరమైన రైతు ప్రత్యేక విశిష్ట సంఖ్య (యూనిక్ నెంబర్)నమోదు కార్యక్రమం అని తెలియజేసారు, కావున రైతులు మీ సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి రైతు ఆధార కార్డు, పట్టాదారు పాసు పుస్తకాలు, మొబైల్ నెంబర్ తీసుకొని ప్రత్యేక పోర్టల్ లో అన్ని వివరాలు నమోదు చేసుకొన్ని తర్వాత ఒక ప్రత్యేక విశిష్ట సంఖ్య పొందవచ్చునని, తద్వారా రాబోయే రోజుల్లో వ్యవసాయ శాఖ ద్వారా వచ్చే వివిధ రకాల పథకాలు, రాయితీలు, పి ఎం కిసాన్,అన్నదాత సుఖీభవ, యంత్ర పరికరాలు, పంటల బీమా, పెట్టుబడి రాయితీలు తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. అలాగే రైతులు అందరూ తప్పనిసరిగా రబీ సీజన్లో వేసిన ప్రతి పంటను పంట నమోదు చేసుకోవాలని అలాగే కెవైసి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సాంకేతిక వ్యవసాయ అధికారి పి .దుర్గా మరియు గ్రామ వ్యవసాయ సహాయకులు వై.ప్రభు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరా పర్యవేక్షణలో ఇంటర్ పరీక్షలు

విశాలాంధ్ర-రాపూరు: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి1తేది శనివారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు జరగనున్నాయి. మొదటి రోజు శనివారం ప్రథమ సంవత్సరం విద్యార్థులతో ప్రారంభం అయ్యాయి. సోమవారం ద్వితీయ సంవత్సరం వారికి జరగ నున్నాయి. జిల్లా వ్యాప్తంగా 79 కేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఆయా కేంద్రా లకు గంట ముందుగా చేరుకోవాలని, అరగంట ముందుగా కేంద్రంలోకి అనుమతిస్తారని ఆర్ఐవో, జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎ.శ్రీనివాసులు పేర్కొన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలె త్తినా కంట్రోల్ రూమ్ నెంబర్ 0861 2320312కు సమాచారం ఇవ్వాలన్నారు. రాపూరుసివికే జూనియర్ కళాశాలలో సీసీ కెమెరా పర్యవేక్ష ణలో ఇంటర్మీడియట్ పరీక్షలుప్రారంభమైనయి.

సామాజిక పెన్షన్లను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలి

విశాలాంధ్ర-వలేటివారిపాలెం: వృద్ధులకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పెన్షన్ లను లబ్ధిదారులు వ్యక్తిగత, వైద్య, ఆహార ఖర్చుల అనంతరం మిగిలిన సొమ్ములను పొదుపు చేసుకొని ఆర్థికంగా బలో పేతం కావాలని ఏహెచ్‌వి ఉప్పుటూరి కిరణ్ అన్నారు. శనివారం మండలంలోని చుండి గ్రామం లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఉదయం 6గంటలకు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఏహెచ్‌వి కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదని ఉద్దేశంతో పింఛ ను మొత్తాన్ని పెద్ద ఎత్తున పెంచి అందజేయడం జరుగుతుందన్నారు. పింఛను సద్వినియోగం చేసుకొని ఖర్చులు పోను నెలనెలా కొంత మొత్తాన్ని పొదుపు చేసుకోవాలని సూచించారు.

సైదాపురంలో తెల్ల రాయి లోడ్ టిప్పర్‌ని పట్టుకున్న పోలీసులు

విశాలాంధ్ర-రాపూరు: సైదాపురం మండలంలోని గునచర్ల గ్రామంలోని రాంగోపాల్ రెడ్డి ఎండిఎల్ యార్డ్ లోని సుమారు 400 టన్నుల తెల్ల రాయి డిగ్రెడ్ సరుకును జెసిబి తో లోడ్ చెసి తరలించు చుండగా సైదా పురం పోలీస్ సంఘటన స్థలానికి మధ్యాహ్నం 3.30 గం లకు చెరుకో ని లోడ్ చెస్తున్న ఏపి 26 బిఆర్ 6177 నెంబర్ గల జెసిపి ని, మరియు ఏపి 16 టిజి 1401 నంబరు గల 10 టైర్ టిప్పర్ని స్వాధీన చెసుకొని, సాయి ని, టిప్పర్ ఓనర్ అయిన అశోక్ ను మరియు వినయ్‌ని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కి తీసుకోని పోయారు.

ఘనంగా సరస్వతి పూజ

విశాలాంధ్ర-కలువాయి: మండల కేంద్రంలోని విశ్వం హైస్కూల్ (నవ భారతి) నందు సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు, పాఠశాల కరస్పాండెంట్ ఎన్‌పిఎన్ ప్రసాద్ నాయుడు మాట్లాడు తూ జరగబోయే పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులు అందరూ ఎటువంటి అనుమానం తావు లేకుండా నూటికి నూరు శాతం ఫలితాలు విద్యార్థులు అందరూ సాధించాలని, తొలి అడుగు ఇక్కడ నుంచే మొదలవుతుందని తెలిపారు. అనంతరం పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను అలరించాయి. కార్యక్ర మంలో పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మయ్య, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థినీ చదువు పట్ల శ్రద్ధను కనపరచాలి

విశాలాంధ్ర-వలేటివారిపాలెం: ప్రతి విద్యార్థిని చదువు పట్ల మరింత శ్రద్ధను కనపరచాలని చుండి ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ పడమటి శ్రీవేంకటేశ్వర్, వలేటివారిపాలెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌యం కమల్ కుమార్ తెలిపారు. శనివారం మండల కేంద్రం అయిన వలేటివారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో హెచ్‌యం కమల్ కుమార్ ఆధ్వర్యంలో సరస్వతీ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చుండి ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ శ్రీవేంకటేశ్వర్ హాజరైనారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇష్టపడి, కష్టపడి చదివినప్పుడే మంచి ఉత్తీర్ణతతో పాటు మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం కూడా కళాశాలలకు ఎంతో చేయూత ఇస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ యం కమల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొని రావాలని అన్నారు.అనంతరం విద్యార్థినీలు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, ఎస్ఎంసీ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఆర్‌లో నాడీవ్యవస్థపై అవగాహన

విశాలాంధ్ర-బిట్రగుంట: బోగోలు మండలం కడనూతల రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శని వారం నాడీవ్యవస్థపై విద్యార్థు లకు అవగాహన సదస్సు నిర్వ హించినట్లు కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ పివిఎన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు లోని అపోలో వైద్యశాల ప్రముఖ న్యూరాలజిస్ట్, మరియు ప్రొఫె సర్గా పనిచేస్తున్న డాక్టర్ బిందు మీనన్ విచ్చేసి నాడీవ్యవస్థపై ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ విద్యార్థులకు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందికి అవగాహనా కార్యక్రమం కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదడు, నాడీ వ్యవస్థకు సంబంధించిన సమస్య లను, నరాలకు సంబంధించిన సమస్యలకు కారణాలు, స్ట్రోక్, పార్క్ ఇన్ సన్ వంటి కేంద్ర నాడి వ్యవస్థ, రుగ్మతల గురించివివరించారు. పై సమస్యలు రావడానికి ప్రధాన కారణం ఆల్కహాల్ తీసుకోవడం, షుగరు, బిపి, విటమిన్ బి12 లోపం, నరాలకు సరిగా రక్తప్రసరణ జరగపోవడంఅన్నారు. వీటి నివారణకు ప్రధానంగా క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, తగినంత విశ్రాంతి తీసుకోవడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, మొబైల్ ఫోను వీలైనంత తక్కువగా వాడడంవంటి జాగ్రత్తలు తీసుకున్నట్లయితే నాడీ వ్యవస్థపై వత్తిడి తగ్గుతుందని, అందరూ ఆరోగ్యంగాఉండవచ్చని తెలియజేశారు. పై కార్యక్రమంలో కళాశాల ఏవో ఆర్‌వి రమణారెడ్డి, అన్నివిభాగాల అధిపతులు, అధ్యాపకులు, అపోలో హాస్పిటల్ కావలి జోన్ పిఆర్ఓ మాధవ తదితరులు పాల్గొన్నారు.

బోర్డు నిబంధనలకు వ్యతిరేకంగా జూనియర్ కళాశాల నిర్వహణ

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: బోర్డు నియమ నిబంధనల వ్యతిరేకంగా నెల్లూరు నగరంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలకు (08064) నిర్వహణ అనుమతి మంజూరు చేయడం పై సమగ్ర విచారణ జరపాలని - షిఫ్టింగ్ లో ఉన్న ఈ కళాశాల కుప్రాక్టికల్, పబ్లిక్ ఎగ్జామినేషన్ సెంటర్ గా కేటాయింపు పై-విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. నెల్లూరు నగరంలో ఇంటర్మీడియట్ బోర్డ్ వారి అనుమతు లు లేకుండా కే ఏపీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆర్ ఐ ఓ కార్యాలయంకు 50 మీటర్ల దూరంలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల కోడ్ నెంబర్ 08064 ఏర్పాటు చేసిన విషయం మీకు ఫిర్యాదు చేశాము నెల్లూరు నగరంలోని తడికలబజార్ లో శ్రీ చైతన్య జూనియర్ కోడ్ నెంబర్ 08054 కళాశాల కు నిన్నటి వరకు అనుమతులు లేవు అడ్మిషన్లు క్లాసులు నిర్వహించారు 2025 జనవరి 21వ తేది క్రితం అనుమతులు ఇచ్చారు. ఫిబ్రవరి మొదటి వారంలో కళాశాల వద్ద బోర్డు ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 10వ తేదీ నుండి 20 వ తేదీ వరకు జరిగిన ప్రాక్టికల్ పరీక్షలకు అనుమతులు ఇచ్చారు. 2025 మార్చి ఒకటి నుండి జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు అనుమతులు ఇచ్చారు. ప్రభుత్వ కళాశాలలకు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా ఎలా అనుమతించారు. షిఫ్టింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న 2025 జనవరి 21 తాముకు అనుమతులు వచ్చాయని చెబుతున్న శ్రీ చైతన్య కళాశాలలో ప్రాక్టికల్,పబ్లిక్ పరీక్షలకు ఎలా అనుమతి ఇచ్చారు. ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిందిగాది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, రాష్ట్ర గౌరవాధ్యక్షులు మలిరెడ్డి కోట రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు నరహరి శిఖరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఈశ్వరయ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ భాస్కర్, దాసరి కమలాకర్, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి కార్యదర్శి రాజశేఖర్, నెల్లూరు జిల్లా కమిటీ సభ్యులు మహేష్ కుమార్, కె.దయాశంకర్, వెంకటప్పయ్య తదిరులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కావలి: ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణా రెడ్డి కావలి నియోజకవర్గంలో ప్రభుత్వం ద్వారా ధాన్యం కొనుగోల విజయవంతంగా పూర్తి చేస్తాం- రైతు నుండి రైస్ మిల్లర్ దాకా అందరికీ అందుబాటులో ఉంటా- మనీ స్కీం లాగా కాకినాడ మచిలీపట్నం మిల్లర్లు వద్దు తోలించుకుని నగదు ఎగ్గొడుతున్నారు. రైతు దళారిని నమ్మొద్దు ప్రభుత్వం కొనుగోల కేంద్రంలోని ధాన్యం అమ్మకాలు చేయండి రైస్ మిల్లర్ దగ్గర సరైన పత్రం తీసుకుంటేనే ధాన్యం ప్రభుత్వానికి చేరినట్టు వారం రోజుల్లో నగదు మీ ఎకౌంటుకు రావాలంటే ధ్రువీకరణ పత్రం తప్పనిసరి- రైతు దేశానికి వెన్నెముక కావలి నియోజక వర్గంలో రైతును కంటికి రెప్పలా- కావలి టీడీపీ కార్యాలయంలో రైతులకు ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏ అవసరం వచ్చిన ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేస్తున్నా.

అల్లిపురం డంపింగ్ యార్డ్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: అల్లిపురం డంపింగ్ యార్డ్‌లో చెత్త తొలగింపుకు మాజీమంత్రి సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేసిన మంత్రి నారాయణ నగరంలోని తొమ్మిదవ డివిజన్ పరిధిలో ఉన్న అల్లిపురం డంపింగ్ యార్డ్ లో చెత్త తొలగింపు కార్యక్రమానికి రాష్ట్ర పురపాలక శాసన మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సర్వేపల్లి శాసనసభ్యులు మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, కువ్వారపు బాలాజీ తదితర ముఖ్య నాయకులతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారుఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం చెత్త పై పన్ను విధించి చెత్త ప్రభుత్వంగా మిగిలిపోయిందని, ప్రజలపై చెత్త పన్ను విధించి 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను మిగిల్చి పోయిందని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇప్పటికే 30 లక్షల టన్నుల చెత్త తొలగించడం జరిగిందని, మిగిలిన 55 లక్షల టన్నుల చేతను అక్టోబర్ 2 నాటికి పూర్తిగా తొలగిస్తామన్నారు. నేడు అల్లిపురం డంపింగ్ యార్డ్, దొంతాలి డంపింగ్ యార్డ్‌లో చెత్త తొలగింపునకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలో చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టామన్నారు. రానున్న ఆరు నెలల్లో డంపింగ్ యార్డ్ లో పూర్తిస్థాయి చెత్త తొలగించి గ్రీనరీని ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వం చట్టాలను ఉల్లంఘించి ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడిందన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఏప్రిల్ ఒకటి నుంచి రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ప్రజలు వివిధ రూపాల్లో కట్టే పన్నులతో ఆయా మున్సిపాలిటీల అభివృద్ధికి కేటాయించడం అభినందనీయమని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రిగా ధన్యవాదాలు తెలియజేశారు. రోడ్లను శుభ్రపరిచేందుకు 72 స్వీపింగ్ యంత్రాలను కొనుగోలు చేస్తున్నామని, త్వరలో యంత్రాలతో రోడ్లను శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టనున్నామని మంత్రి తెలిపారు. నెల్లూరు నగరాన్ని అభివృద్ధికి నారాయణ ఎంతో కృషి చేస్తున్నారన్నారనీ ఎంఎల్ఏ సోమిరెడ్డి చంద్ర మోహన రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, మునిసిపల్ కమీషనర్ సూర్యతేజ, నాయకులు, అధికారులు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉదయ కాళేశ్వర స్వామి తెప్పోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: కొడవలూరు మండలం గండవరం గ్రామం లోని గంగ పార్వతి సామెత ఉదయ కాళేశ్వర స్వామి వారి తెప్పోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గండవరం శివాలయం ఎంతో విశిష్టత కలిగిన చారిత్మాత్మక శైవ క్షేత్రమని అభివర్ణించారు. చోళ రాజుల కాలం నాటి శతాబ్దాల చరిత్ర కలిగిన ఉదయ కాళేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే ఇటువంటి ధార్మిక ఉత్సవాలతో దైవిక చింతనతో పాటు గ్రామ ఐక్యతకు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరా కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభి రామిరెడ్డి, వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, టిడిపి నాయకులు ఆవుల వాసు పాల్గొన్నారు.

అలరించిన శ్రీ శివపార్వతుల కళ్యాణం నృత్య రూపకం

విశాలాంధ్ర-కావలి: కావలి పట్టణం పాతూరు శ్రీ దుర్గా భ్రమరాంబా సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి కుంభమాస తిరునాళ్ళు సందర్భంగా శ్రీ శివగామినీ సమేత ఆనంద నటరాజ స్వామి వారి సాంస్కృతిక సేవా సంఘం వారు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో శివాలయం ప్రధాన అర్చకులు శశిధర్ గురుకుల్ సహకారంతో శుక్రవారం రాత్రి కావలి పట్టణానికి చెందిన సంయుక్త నృత్య కళా నిలయం నాట్య గురువు గంగపట్నం లిఖిత మరియు వారి శిష్యులు నృత్య ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా ప్రదర్శించిన శ్రీ శివపార్వతుల కళ్యాణం నృత్య రూపకం ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం నృత్య ప్రదర్శన చేసిన పిల్లలకు ప్రధాన అర్చకులు శశిధర్ చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. నాట్య గురువు గంగపట్నం లిఖితను ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సంయుక్త నృత్య కళా నిలయం నాట్య గురువు గంగపట్నం లిఖిత మాట్లాడుతూ తమకు ఈ చక్కని అవకాశాన్ని కల్పించిన ప్రధాన అర్చకులు శశిధర్ గురుకుల్ కి మా సంయుక్త నృత్య కళా నిలయం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామన్నారు. నృత్య రూపకం స్క్రిప్ట్ రికార్డింగ్ కోసం వాయిస్ ఇచ్చిన విశ్రాంత బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ ఎం చంద్రశేఖర్, శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల లెక్చరర్ పి వి సాయి తేజ కి, పిల్లలకు జ్ఞాపికలను బహుమతిగా అందజేసిన డాక్టర్ రవికాంత్ - హరిత దంపతులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు.

కప్పరాళ్లతిప్పలో నవోదయం 2.0 పై అవగాహన

విశాలాంధ్ర-బిట్రగుంట: బోగోలు మేజర్ పంచాయతీ కప్ప రాలతిప్పలో శనివారం నవోదయం 2.0 పై గ్రామస్తులకు జిల్లాఎక్సైజ్ ఉన్నతాధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు, జిల్లాఎక్సైజ్ అధికారి ఏ.శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో జిల్లాలోని గ్రామాలను సంపూర్ణ సారారహిత గ్రామాలుగా తీర్చిదిద్దడంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. కాపు సారా తాగడం వలన ఎన్నో కుటుంబాలు చిన్నా భిన్నమైపోతున్నాయని, చిన్న వయస్సులోనే భర్తలను పోగొట్టుకొని మహిళలు వితంతువుల వుతున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ పెద్దలు గ్రామాలకు కావలసిన అవసరతలపై అధికారులకు వినతి పత్రం సమర్పించారు. పై కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ ఉన్నతాధికారులు జే.రమేష్, ఎన్ఫోర్స్మెంట్ వింగ్ సీఐ వెంకటేశ్వర్లు, ఈఎస్‌టిఎఫ్ సిఐ శ్రీనివాసరావు, కావలి సి.ఐ యస్.శ్రీనివాసులు, బుచ్చిరెడ్డిపాలెం సిఐ కిషోర్ వారి సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ మాలకొండ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న ఎంపీ కలిశెట్టి

విశాలాంధ్ర-వలేటివారిపాలెం: వలేటివారిపాలెం మండలం అయ్యవారిపల్లి పంచాయతీ మాలకొండ గ్రామంలో వెలిసిన శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామిని శనివారం విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పల నాయుడు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆలయ సంప్రదాయాలతో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాని హర్ష కుమార్ ఇతర ముఖ్యనాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెంచులక్ష్మి ఆదిలక్ష్మీ సమేత నరసింహస్వామి తిరుచ్చి పల్లకి సేవ

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు మండలంలోని పెంచలకోన క్షేత్రం నందు శనివారం ఉదయం గం.4 స్వామి వారికి అభిషేకం, 10.30కి శ్రీవార్లకు కళ్యాణోత్సవం, సాయంత్రం గం.5.30. లకు చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మి సమేత నరసింహ స్వామి వారి కి తిరుచ్చి పల్లకి సేవ సహస్రదీపాలంకరణ సేవ (ఊంజల్ సేవ) వైభవంగా నిర్వహించడం జరిగింది. భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా క్యూలైన్ల ఏర్పాట్లు, మంచి నీరు సరఫరా, అన్నదానం మొదలగు కార్యక్రమాలు ఉప కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులరెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించ డం జరిగింది.

గోయాజ్ లగ్జరీ సిల్వర్ జ్యువెలరీ స్టోర్ ప్రారంభించిన సినీనటి అనుపమ పరమేశ్వరన్

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: నెల్లూరు మినీ బైపాస్ రోడ్‌లోని గోయాజ్ సిల్వర్ జ్యువెలరీని సినీనటి అనుపమ పరమేశ్వరన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాకు సిల్వర్ జ్యువెలరీలో ట్రెడిషనల్ జ్యువెలరీ ఇష్ట పడతాను. నాకు నెల్లూరు చేపల కూర అంటే చాలా ఇష్టం వేడి వేడి అన్నంలో చేపల పులుసు వేసుకొన్ని తిన్నటాను త్వరలో రెండు కొత్త సినిమాలు పరదా, డ్రాగన్‌తో వస్తున్నాను అని తెలిపారు. నెల్లూరు లోమన్నికైన నాణ్యత గల ఆభరణాల సంస్థ గోయాజ్ సిల్వర్ జ్యువెలరీ 9వ షోరూం ప్రారంభించే అవకాశం నాకు రావడం సంతోషంగా వుంది. దక్షిణ భారతదేశం అంతటా వేగంగా విస్తరిస్తూ నెల్లూరులోని మినీ బైపాస్ రోడ్, ముగుంట లేఔట్‌లో వి.ఆర్.కె సిల్క్స్ ఎదురుగా అతి పెద్ద అంతస్తులలో 3,000 చదరపు అడుగులకు విశాలవంతమైన సిల్వర్ జ్యువెలరీ స్టోర్ ని ఇపుడు మన నెల్లూరులో లాంచ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే విజయ రామిరెడ్డి కార్పొరేటర్ మదన్ తదితరులు పాల్గొన్నారు. గోయాజ్ స్టోర్ ప్రారంభం సందర్భంగా మార్చి 1 నుండి 9 వరకు అద్భుతమైన ఆఫర్లను మీకు కోసం తీసుకువచ్చింది. మార్చి 1 నుండి 9 వరకు గొప్ప ప్రారంభ ఆఫర్లతో సహ దాని విస్తృత సేకరణలతో మిమ్మల్ని ఆనందం చేస్తుంది. 1,00,000 విలువైన వెండి ఆభరణాలను కొనండి 50,000 విలువైన డైమండ్ నెక్లెస్ చెవిపోగులుపొందండి. 50,000 విలువైన వెండి ఆభరణాలు కొనండి 25 వేల విలువైన టెంపుల్ ఆభరణాల గొలుసు ఉచితంగా పొందండి. 25 వేల విలువైన వెండి ఆభరణాలు కొనండి. 12,500 విలువైన గుండు మల్లా నెక్లెస్ పొందండి. అని నిర్వాహకులు రవితేజ వేములూరి ప్రియాంక వేములూరి తెలిపారు. మా వద్ద అన్ని వెండి ఆభరణాలు 92.5 హాల్మార్క్ 22 కే గోల్డ్ ప్లేటెడ్ అభరణాలు. మీరు 55 శాతం ప్రత్యేకమైన రిటర్న్ విలువతో 50,000 కంటే ఎక్కువ డిజైన్ల నుండి ఎంచుకోవచ్చు. (మీరు జీవితకాలానికి దానిని మార్పిడి చేయవచ్చు). విదేశీ క్లయింట్ల కోసం ఫ్రీ పాన్ ఇండియా డెలివరీ ప్రయోజనం గ్లోబల్ షిప్పింగ్‌తో మీరు ఎక్కడి నుండైనా షాపింగ్ చేయడానికి వీడియో కాలింగ్ సౌకర్యం ఉంది.

వేసవి వచ్చేసింది.. అప్రమత్తంగా వుండండి

- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: వేసవి సందర్భంగా కోవూరు నియోజకవర్గంలో తాగునీటి సమస్యలు రాకుండా అప్రమత్తంగా వుండాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అధికారులను ఆదేశించారు. నెల్లూరు నగరం మాగుంట లే అవుట్ లోని ఆమె నివాసంలో కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఎంపిడిఓలు గ్రామీణ నీటి సరఫరా సంస్థ అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎక్కడ తాగునీటి సమస్య ఉత్పన్నమైనా 24 గంటలలో సమస్య పరిష్కరించేలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకర్లకు వాటర్ లిఫ్ట్ చేసే మోటార్లు రిపేర్ అయిన పక్షంలో ప్రత్యామ్నాయంగా అదనపు మోటారు అందుబాటులో వుంచుకోవాలని సూచించారు. మార్చి 2 నుంచి రంజాన్ మాసం సందర్భంగా మసీదుల వద్ద మెరుగైన పారిశుధ్య నిర్వహణ చర్యలు చేపట్టాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓలు, గ్రామీణ నీటి సరఫరా సంస్థ అధికారులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా జంగిల్ తొలగింపు

విశాలాంధ్ర-కొండాపురం: ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ ఆదేశాలతో కొండాపురం మండల నాయకత్వం కదిలింది. గ్రామ నాయకుడు అల్లిక మధు సారథ్యంలో వెంకట రంగాపురం నుంచి గరిమెన పెంట వరకు రెండు కిలోమీటర్ల పొడవున రోడ్డుకు విరువైపుల ఉన్న కర్ర తుమ్మ చెట్లను, పిచ్చి మొక్కలను, తొలగించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా, రవాణాకు సౌకర్యం కల్పించారు. సుమారు రూ.20 వేలు వెచ్చించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించారు. వెంకటరంగాపురం నుంచి సుమారు 40మంది విద్యార్థినీ విద్యార్థులు ప్రతిరోజు గరిమెనపెంట లోని హైస్కూలుకు వెళుతూ ఉంటారు. చెట్లు ఏపుగా పెరగడంతో భయాందోళనలో విద్యార్థులు ఉన్నారు. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి రాగా రోడ్డుకు విరువైపులా ఉన్న చెట్లను తొలగించాలని ఆదేశాలిచ్చారు. గ్రామ నాయకుడు అల్లిక మధు దగ్గరుండి జెసిబి సహాయంతో చెట్లను తొలగించారు. దీంతో వెంకట రంగాపురం గరిమెన పెంట గ్రామ వాసులు చుట్టుపక్కల గ్రామ ప్రజలు విద్యార్థిని విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలియజేశారు.